6న మెగా జాబ్‌మేళా

విజయనగరం (ఆంధ్రజ్యోతి) మార్చి 2: నగరంలోని ఎంఆర్ అటానమస్ కళాశాలలో ఈ నెల 6న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి డి.అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రెడ్డీస్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, హెట్రో ల్యాబ్స్, ముతూట్ ఫైనాన్స్, ఫ్యూషన్ మైక్రోఫైనాన్స్ తదితర ప్రైవేట్ సంస్థల్లో 910 ఉద్యోగాల భర్తీకోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ అభ్యర్థులు అర్హులని, ఒరిజనల్ సర్టిఫికెట్లు, 2 పాస్ ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 89193 78915 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



పొలిటికల్ ప్రారంభోత్సవాలు

- హడావుడిగా ప్రభుత్వ భవనాల ప్రారంభాలు
- ఎన్నికల ముందు అధికార పార్టీ బిల్డప్
- నిధులు కేంద్రానివి.. సోకులు రాష్ట్రానివి

గజపతినగరం: మండలంలోని గంగచోళ్ల పెంట గ్రామంలో శనివారం రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలతో పాటు పట్రువాడ గ్రామం వద్ద మినీ వంతెనను మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ప్రజా సంక్షేమానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, అభివృద్ధిలో రాజీ లేకుండా పనులు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా మంత్రి గొప్పలు చెప్పారు. అయితే, గత నాలుగున్నరేళ్ల ప్రభుత్వ భవనాలను పట్టించుకోని మంత్రి.. ఎన్నికల సమయం కావడంతో ఇప్పుడు హడావుడిగా వాటిని ప్రారంభించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విజయనగరం (ఆంధ్రజ్యోతి) మార్చి 2:

ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లాలో అధికార పార్టీ నేతలు హడావుడిగా ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు మొదలుపెట్టారు. గత నాలుగున్నరేళ్ల పాటు పట్టించుకోని పాలకులు ఇప్పుడు ఎన్నికల ముందు బిల్డప్ ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు సంబంధిత ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. అయితే, నాలుగున్నరేళ్లు దాటినా ఇప్పటికీ చాలా భవనాలు పూర్తికాలేదు. కొన్ని సచివాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వాటికి ప్రతినెల అద్దె కూడా సక్రమంగా చెల్లించని పరిస్థితి నెల కొంది. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో మంత్రి బొత్స సత్యనారాయణ అండ్-కో.. కొత్తభవనాలకు శంకుస్థాపనలు చేస్తూ, నిర్మాణాలు పూర్తయిన వాటిని ప్రారంభిస్తూ తెగ హడావుడి చేస్తున్నారు. నిజానికి 2020-21లో జగన్ మానసపుత్రికగా చెప్పుకుంటున్న సచివాలయ వ్యవస్థలోనే సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలు మొదలు పెట్టారు. కొన్నిచోట్ల స్థల వివాదాలు, మరి కొన్నిచోట్ల కాంట్రాక్టర్లు రాకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికీ పూర్తికాని భవనాలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఎన్నికల సమీపిస్తుండడంతో వైసీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసరికి ఎక్కువ సంఖ్యలో భవనాలను ప్రారంభించేటట్లు చూడాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో హడావుడిగా ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. వాస్తవానికి ఈ భవనాల నిర్మాణానికి ఎక్కువ మొత్తంలో కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేసింది. కానీ, వైసీపీ ప్రభుత్వం మాత్రం తామే నిర్మిస్తున్నట్లుగా బిల్డప్ ఇస్తుంది. గత కొన్ని రోజులుగా మంత్రి ఇలాకా అయిన చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల తదితర మండలాల్లో పలు ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తున్నారు. కొన్నిచోట్ల భవనాల పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో భవనాల పరిస్థితి ఇది..

● జిల్లాలో సచివాలయ భవనాలు 498 నిర్మించాల్సి ఉండగా 375 మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన 123 వివిధ దశల్లో ఉన్నాయి. ● రైతు భరోసా కేంద్రాలు 417 మంజూరు కాగా 291 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 126 వివిధ దశల్లో ఉన్నాయి. ● 311 వెల్‌నెస్ సెంటర్లకు గాను 178 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 133 పూర్తి కావాల్సి ఉంది. ఇవి ఎప్పుడు పూర్తవుతాయో తెలియదు.

ఎస్‌టీవోపై ఎమ్మెల్యే చిందులు

● స్థలం ఇవ్వనందుకు పిలిపించి చీవాట్లు



సబ్ ట్రెజరీ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి, మార్చి 2: బొబ్బిలి సబ్ ట్రెజరీ అధికారి ఎల్.సత్యనారాయణపై ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పల నాయుడు చిందులు తొక్కారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆనుకుని సబ్‌ట్రెజరీ కార్యాలయ నూతన భవనం ఉంది. ఆ భవనంలో సెల్లార్ మాదిరిగా కింది భాగాన సమావేశపు హాలులాంటిది ఉంది. శనివారం బొబ్బిలి మండలానికి చెందిన 654 మందికి జగనన్న ఇంటి స్థల హక్కు పత్రాల పంపిణీ చేపట్టేందుకు ఆ స్థలాన్ని ఇచ్చేందుకు ఎస్‌టీవో నిరాకరించడం ఎమ్మెల్యే ఆగ్రహానికి కారణమైంది. తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని వాహనాల షెడ్‌లో జగనన్న ఇంటి స్థలాల హక్కు పత్రాల పంపిణీ చేపట్టారు. తహసీల్దారు త్రినాథరావు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంబంగి, జడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి హాజరయ్యారు. పక్కనే ఉన్న సమావేశపు హాలులో కాకుండా ఇక్కడ ఎందుకు ఏర్పాట్లు చేశారని ఎమ్మెల్యే ఆరా తీశారు. ఎస్‌టీవో అనుమతి ఇవ్వలేదని రెవెన్యూ అధికారులు చెప్పడంతో ఆయన్ను రమ్మని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన వచ్చాక మండిపడ్డారు. రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో ఎస్‌టీవో కార్యాలయం ఉందని తహసీల్దారు సుప్రీం అని అన్నారు.

804 మంది గైర్హాజరు

● ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం ● తొలిరోజు 18,875 మంది హాజరు

కలెక్టరేట్/బొబ్బిలి/ఎస్.కోట రూరల్, మార్చి 2: ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 73 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 19,679 మంది విద్యార్థులకు 18,875 మంది రాశారు. 804 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష హాల్‌లోకి అనుమతించారు. తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకూ నిర్వహించారు. అన్ని కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. బొబ్బిలి కోరాడవీధికి చెందిన హరి విష్ణుప్రియ అనే విద్యార్థిని రాజా కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చింది. శారీరక ఎదుగుదలలేని ఆమెను తండ్రి ఎత్తుకుని పరీక్ష కేంద్రానికి తీసుకుని వచ్చారు. బొబ్బిలి మండలం భోజరాజ పురం రోడ్డులోని ఆసియన్ అంధుల పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులను ప్రత్యేక బస్సులో పరీక్ష కేంద్రానికి ఉపాధ్యాయులు తీసుకుని వచ్చారు. వారు పరీక్ష రాసేందుకు సహాయంగా మరికొంతమంది విద్యార్థులు వచ్చారు.



బొబ్బిలి: విష్ణుప్రియను ఎత్తుకుని పరీక్ష కేంద్రానికి తీసుకుని వచ్చిన తండ్రి



బొబ్బిలిలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



ఎస్.కోటరూరల్: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

దొంగ నోట్ల ముఠా గుట్టు రట్టు

● రూ.14.50 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం

● జైల్లోనే వ్యూహరచన ● ఇద్దరు అరెస్టు.. మరొకరు పరారీ

విజయనగరం క్రైం, మార్చి 2: దొంగనోట్ల ముఠా గుట్టుని పోలీసులు రట్టు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.14.50 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. మరొకరు పరారీలో ఉన్నారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో విజయనగరం డీఎస్పీ గోవిందరావు విలేకరులకు వెల్లడించారు. టూటౌన్ సీఐ రామారావుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది విజయనగరం కోట జంక్షన్ సమీపంలోని గుమ్చీ వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. వీరిని చూసి విజయనగరం వైఎస్సార్ నగర్‌కు చెందిన బంగారి చక్రధర్, దత్తిరాజేరు మండలం గడసాం గ్రామానికి చెందిన రాజాన విష్ణు పారిపోతుండగా, వెంటనే పోలీసులు అప్రమత్తమై వారిని పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా ఒక్కొక్కరి వద్ద రూ.25 వేల చొప్పున రూ.50 వేల విలువైన దొంగనోట్లు పట్టుబడ్డాయి. వెంటనే స్టేషన్‌కు తరలించి విచారించగా జైల్లోనే తాము వ్యూహరచన చేసినట్లు నిందితులు చెప్పారు. చక్రధర్ వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ కేసులో పట్టుబడి సబ్ జైల్లో ఉన్నాడు. అదే సబ్ జైలులో ఉన్న ఒడిసా రాష్ట్రం జర్సాపూర్ జిల్లా మంగళాపూర్ స్టేషన్ పరిధిలోని కాంతియా గ్రామానికి చెందిన చంద్ర మణిబాల్ పరిచయం అయ్యాడు. తాను దొంగనోట్లు సప్లయ్ చేస్తుంటానని చంద్రమణిబాల్ చెప్పాడు. తాను కూడా అదే దొంగనోట్లు సప్లయ్ చేస్తానని చక్రధర్ చెప్పడంతో జైల్లోనే వ్యూహరచన చేశారు. ఈక్రమంలో జైలు నుంచి విడుదలైన అనంతరం చక్రధర్ తన స్నేహితుడైన రాజాన విష్ణుతో కలిసి చంద్రమణిబాల్ వద్ద దొంగనోట్లు తీసుకుని చలామణి చేయడం ప్రారంభించారు. ఇటీవల విజయనగరం రైల్వే స్టేషన్ వద్ద చంద్రమణిబాల్ నుంచి రూ.15.50 లక్షల నకిలీ కరెన్సీ (రూ.500 నోట్లు) తీసుకుని దానికి బదులుగా రూ.3 లక్షలు అసలైన నగదు చెల్లించినట్లు పోలీసు విచారణలో వెల్లడించారు. చంద్రమణిబాల్ పరారీలో ఉన్నాడని, త్వరలో అదుపులోకి తీసుకుని ఈ వ్యవహారం ఎక్కడి నుంచి జరుగుతుంది? ఎవరెవరు సూత్రధారులు అనేది పూర్తిస్థాయిలో నిర్ధారిస్తామని డీఎస్పీ తెలిపారు. చక్రధర్, రాజాన విష్ణును రిమాండ్‌కు తరలించామని, వీరి నుంచి రూ.14.50 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. దొంగనోట్ల ముఠాను పట్టుకున్న సీఐ రామారావు, ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బందిని ఎస్పీ దీపిక, డీఎస్పీ గోవిందరావు అభినందించారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

● ఆకాశాన్నంటుతున్న సిమెంట్, ఐరన్ ధరలు

● కంకర, గ్రానైట్ రేట్లు కూడా.. ● అందని ద్రాక్షగా ఇసుక



గృహ నిర్మాణం.. పెనుభారం

(రాజాం)

ప్రస్తుతం గృహ నిర్మాణ సామగ్రి ధరలు

సిమెంట్ బస్తా	రూ.350
టన్ను ఇనుము	రూ.60,000
ఇసుక (ట్రాక్టర్)	రూ.4,000
ఇసుక (లారీ)	రూ.25,000
చిప్స్ (ట్రాక్టర్)	రూ.7,000
చిప్స్ (లారీ)	రూ.19,000

జిల్లాలో నిర్మాణరంగం నీరసించింది. నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలతో అనేక మంది ఇళ్ల నిర్మాణానికి ఆసక్తిచూపడం లేదు. అటు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణం చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. సిమెంట్, ఇసుక, ఇనుము, రాయి. చిప్స్, ఇటుక వంటి భవన నిర్మాణ సామగ్రి ధరల స్థిరీకరణ లేదు. ఏరోజుకారోజు పెరుగుతూ వస్తున్నాయి. ముడి సరుకుల ధరలను సాకుగా చూపి ఉత్పత్తి సంస్థలు ధరలు పెంచుతున్నాయి. ఇదే అదునుగా కొంతమంది వ్యాపారులు సిండికేట్‌గా మారి కృత్రిమ కొరత సృష్టించి దోచుకుంటున్నారు. దీంతో ధరలు పెరిగి నిర్మాణదారులపై ఆర్థికభారం పడుతోంది. నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టనట్టుగా వ్యవహరిస్తోంది.

గృహ నిర్మాణదారులు ఎన్నడూలేనంత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. సిమెంట్, ఐరన్, ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో ఆర్థికభారంతో సతమతమవుతున్నారు. సిమెంట్ బస్తా రూ.350, టన్ను ఐరన్ రూ.60,000, ట్రాక్టరు ఇసుక రూ.4,000, లారీ లోడు ఇసుక రూ.20 వేలకు పైగా పలుకుతోంది. దీంతో గృహ నిర్మాణం భారమవుతోందని నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. అసంపూర్తిగా పనులు నిలిపివేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణాలకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక అన్నది ప్రజలకు అందని ద్రాక్షగా మిగిలింది. జిల్లా అవసరాలకు తగ్గట్టు ఇసుక సరఫరా కావడం లేదు. ఎప్పటికప్పుడు ఇసుక పాలసీలను ప్రకటించినా ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుపడడం లేదు. ఇటీవల ప్రభుత్వం ఇసుక పాలసీని ప్రకటించింది. వారం వారం పత్రికల్లో ఇసుక ధరలను ప్రకటిస్తోంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఎక్కడా ఆశించిన స్థాయిలో ఇసుక లభ్యత లేదు. జిల్లాలో చంపావతి, వేగావతి గోస్తని, వంశధార నదులతో పాటు కాలువల్లో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. జగనన్నకాలనీ లేఅవుట్లు, ప్రభుత్వ కార్యాలయాల భవనాల పేరిట ఇసుక తరలించుకుపోతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా పనులు జరుగుతున్న దాఖలాలు లేవు. కొందరు గృహనిర్మాణ అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కవుతున్నట్టు ఆరోపణలున్నాయి. చంపావతి నది నుంచి ప్రతిరోజూ వందలాది టైరుబళ్లలో ఇసుకను తరలించుకుపోతున్నారు. ప్రస్తుతం నదుల్లో నీరు తగ్గినా కొత్తగా రీచ్‌లు ప్రకటించలేదు. ఇది అక్రమార్కులకు కలిసివస్తోంది. ప్రస్తుతం ట్రాక్టరు ఇసుక ధర రూ.4వేల పైమాటే. లారీ లోడు ఇసుక రూ.20వేలు దాటుతోంది. దూరం బట్టి రూ.25వేలు వసూలు చేస్తున్నారు.

పన్నులను పెంచిన ప్రభుత్వం..

గృహ నిర్మాణం భారమవుతున్న వేళ ప్రభుత్వం ఖనిజాలపై భారీగా పన్నులు పెంచింది. అన్ని రకాల చిన్న ఖనిజాలు, గ్రానైట్‌పై సీనరేజ్‌తో పాటు కన్సిడరేషన్ ఫీజులు పెంచింది. దీంతో క్వారీల వద్ద రూ.12 వేలకు లభించే కంకరాయి (చిప్స్) లోడు రూ.19 వేలకు పెరిగింది. సాధారణంగా గ్రానైట్ చదరపు అడుగు రకాలు బట్టి రూ.60 నుంచి రూ.130 వరకూ దొరుకుతాయి. ప్రభుత్వ నిర్ణయంతో అన్నిరకాల గ్రానైట్‌పై రూ.30 పెరిగింది. గతంలో టన్ను చిప్స్‌కు రూ.60 సీనరేజ్ ఫీజు ఉండేది. ప్రస్తుతం కన్సరైజేషన్ ఫీజుతో కలిపి సీనరేజ్‌ను రూ.120 వసూలు చేస్తున్నారు. గ్రానైట్‌కు సీనరేజ్‌తో పాటు 50 శాతం కన్సరైజేషన్ ఫీజు అదనంగా చెల్లించాల్సి వస్తుండడంతో ధరలు పెంచక తప్పడం లేదని క్వారీల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఈ ప్రభావం గృహ నిర్మాణంపై పడుతోంది.

ఉద్యోగ, ఉపాధి కల్పన టీడీపీతోనే సాధ్యం

● గ్రామాల్లో ప్రచారం చేస్తున్న టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులు

● వైసీపీని ఓడించాలని పిలుపు


మాట్లాడుతున్న సంధ్యారాణి


మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

మెంటాడ, మార్చి 2: మండలంలో జయతి గ్రామంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యాక్షులు ఆర్.పి.బంజ్ దేవ్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు గురించి వివ రించారు. ఈ సందర్భంగా బంజ్ మాట్లాడుతూ ప్రజలు శుఖంగా, సంతో షంగా ఉండాలంటే సంధ్యారాణిని ఎమ్మెల్యేగా గెలిపించికోవాల్సిన ఆవశ్య కత ఎంతైనా ఉందన్నారు. ● వైసీపీ, బీజేపీ నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి సంధ్యారాణి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ శ్రేణులు చలుమూరి వెంకట రావు, జి.అన్నవరం, జి ముసలి నాయుడు, రామచంద్రుడు, ఎస్.నారం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం టీడీపీతోనే సాధ్యమని గజపతినగరం నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శని వారం చౌదంతివలస, పోరలి, సరేవలస, భూపాలరాజపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులను అన్నివిధాలా మోసం చేశారన్నారు. ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రగల్బాలు పలికారని, నిరుద్యోగుల ఓట్లు దండుకొని గద్దెనెక్కిన తరువాత నోటిఫికేషన్ల ఊసే పట్టించుకోలేదని ఆరోపించారు. అన్నివర్గాల ప్రజలను ఆలోచించి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా చౌదంతి వలస గ్రామానికి చెందిన పలువురు తాగునీటి, పారిశుధ్యం, రోడ్లు, పెన్షన్ తదితర సమస్యలను శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, టీడీపీ మండలప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ బంగారునాయుడు, నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

గజపతినగరం: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందాలంటే విజనరీ ఉన్నచంద్ర బాబుతోనే సాధ్యపడుతుందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని జిన్నాం, వేమలి, కొత్తవలస, రంగుపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు మొదటి సారి ఓటు రావడంతో భవిష్యత్‌ను గుర్తు చేసుకొని ఓటు వేయాలని సూచించారు. జగన్ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేక పోయారని దీంతో చెడు మార్గాన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు దేశం పార్టీని గెలిపించుకోవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ ఎంపీటీసీ లోగిస కాంతమ్మ, పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● సోదరుడి పెళ్లి కార్డులు ఇవ్వడానికి వెళుతుండగా ప్రమాదం


సత్యనారాయణ (ఫైల్)

సబ్బవరం, మార్చి 2: తన సోదరుడి వివాహ శుభలేఖలు బంధువులకు ఇవ్వడానికి బైక్‌పై బయలుదేరిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ప్రమాదం సబ్బవరం మండలంలోని అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగింది. దీనికి సంబంధించి సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కోమటపల్లి గ్రామానికి చెందిన సంగరాతి సింహాచలం, పద్మ దంపతుల కుమారులు ఈశ్వరరావు, సత్యనారాయణ ఉపాధి నిమిత్తం కొంత కాలం క్రితం గాజువాక సమీపంలోని దువ్వాడ వచ్చారు. అక్కడ ఉంటూ దగ్గర్లోని రెస్టారెంట్‌లో వంట మాస్టర్లుగా అన్నదమ్ములు ఇద్దరూ పని చేస్తున్నారు. అన్న ఈశ్వరరావుకు ఈ నెల 27న వివాహం జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సత్యనారాయణ అనకాపల్లిలో తన స్నేహితుడికి శుభలేఖ ఇవ్వడానికి వెళ్లి రాత్రి అక్కడే ఉండిపోయాడు. బొబ్బిలిలో శుభలేఖలు ఇవ్వడానికి అతను శనివారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. సబ్బవరం మండలం ఇరువాడ వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వెళుతుండగా ఎదురుగా వస్తున్న క్వారీ లారీ అతడిని ఢీకొంది. దీంతో అతను ఎడమ వైపు పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న డంపర్ లారీ అతని పైనుంచి వెళ్లిపోవడంతో శరీరం నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సీఐ సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్టు

విజయనగరం క్రైమ్, ఫిబ్రవరి 2: మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ చేయిస్తున్నట్టు చెప్పి ఫోర్జరీ సంతకంతో ఉత్తర్వులు జారీ చేయించిన ఘటనలో వ్యక్తి అరెస్ట్ అయ్యాడు. దీనికి సంబంధించి శనివారం సీఐ వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా సీఆర్పీ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు నగరానికి చెందిన అంబులెన్స్ శివ పరిచయం అయ్యాడు. విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న హేమంత్ కుమార్ అనే వ్యక్తికి విజయనగరం జిల్లా నుంచి తూర్పు గోదావరి జిల్లాకు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌గా వెళ్లేందుకు ఆసక్తిగా ఉన్నట్లు నమ్మించాడు. ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని చెప్పి శ్రీనివాసరావు వద్ద నుంచి రూ.2.5 లక్షలు తీసుకున్నాడు. హేమంత్‌కుమార్‌కు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌గా వెళ్లేందుకు ఆసక్తి లేనప్పటికీ అతని పేరున దరఖాస్తు రాసి, అతని సంతకాన్ని ఫోర్జరీ చేసి శ్రీనివాసరావుకు అప్పగించాడు. దీంతో శ్రీనివాసరావుకు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ అయినట్లు ఉన్నతాధికారుల నుంచి బదిలీ ఉత్తర్వులు జారీ అవడంతో తాను ఏవిధమైన దరఖాస్తు చేయలేదని హేమంత్ కుమార్ వాపోయాడు. శ్రీనివాసరావుకు బదిలీ కాకపోవటంతో అంబులెన్స్ శివపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో అంబులెన్స్ శివ, హేమంత్ కుమార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి శ్రీనివాసరావును మోసం చేసినట్లు నిర్ధారణ అయింది. దీంతో అంబులెన్స్ శివను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వెంకట్రావు తెలిపారు.

భీమసింగి వంతెనపై రోడ్డు ప్రమాదం

● యువకుడికి గాయాలు

జామి, మార్చి 2: మండలంలోని భీమసింగి వంతెనపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంట్యాడ మండలం కొత్తవెలగాడకు చెందిన చంటి బైక్‌పై విజయనగరం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చంటికి గాయాలు కాగా 108 వాహనంలో విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై జామి పోలీసులు మాట్లాడుతూ ఫిర్యాదు ఇంకా అందాల్సి ఉందని తెలిపారు. ఈ కారు మండలంలోని వైసీపీ నాయకుడిదిగా చెబుతున్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

రామభద్రపురం: మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. స్థానిక చినమ్మతల్లి ఆలయం సమీపంలో నిర్వహిస్తున్న దాడుల్లో అనధికారికంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 14 మద్యం బాటిళ్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

కొత్తవలస: ముసిరాం, రామలింగపురం గ్రామాలలో నాటు సారా తయారీ నియంత్రణ కావడం లేదు. రెండు రోజుల కిందట అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు సంబంధించిన వివిద శాఖల అధికారులు, సిబ్బంది నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు చేసి 2,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. రామలింగపురంలో కొత్తవలస సీఐ 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. తాజాగా శనివారం మరోసారి రామలింగపురంలో కొత్తవలస సీఐ చంద్రశేఖర్ నిర్వహించిన దాడులలో 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

దేవాలయానికి తాళాలు

● పోలీసులకు ఈవో పిర్యాదు

రాజాం: సంతకవిటి మండలం హొంజరాంలో వెలసిన వల్లభ నారాయణ మల్లికార్జున స్వామి దేవాలయ అర్చకుడు బంకుపల్లి పార్వతీమల్లీశ్వర శర్మ ఆలయానికి తాళాలు వేసి..విధులకు గైర్హాజరయ్యాడని ఈవో బీవీ మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. తాళాలు దేవదాయ శాఖ అధికారులకు అప్పగించకుండా వేరే దేవాలయంలో చేరినట్లు తెలిసిందన్నారు. ఈ విషయంపై గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో తాను స్వయంగా వెళ్లి పరిశీలించానని తెలిపారు. ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదని... ఈ విషయంపై సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేశామని మాధవరావు తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తక్షణమే తాళాలు అప్పగించకపోతే అర్చకుడిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

లక్కవరపుకోట: గొల్జాం గ్రామంలో కొలువైన షిర్డి సాయిబాబాకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఏడో వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్థులంతా బాబాకు హోమాలు, ప్రత్యేక పూజలు చేసి... అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

హత్యా రాజకీయాలు, అభివృద్ధికి మధ్య యుద్ధం

రాజాం: హంతకులకు రాష్ట్ర ప్రజలకు మధ్య యుద్ధం కొనసాగుతుందని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో రేగిడి సంతకవిటి మండలాలకు చెందిన పలు గ్రామాల బూత్ కమిటీ ఇన్‌చార్జిలు, వార్డు కమిటీ ఇన్‌చార్జిలతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. హత్యారాజకీయాలకు అభివృద్ధి రాజకీయాలకు మధ్య యుద్ధం అన్నారు. వంచన మోసం, కుట్రలు కుతంత్రాలు చేసే పార్టీకి అభివృద్ధి సంక్షేమం చేసే పార్టీలకు మధ్య యుద్ధం అన్నారు. జగన్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కిమిడి అశోక్‌కుమార్, కర్నేని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్సు అధికారుల దాడులు

విజయనగరం క్రైం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ విజిలెన్స్ సీఐ కె.కృష్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 107 కేసులు నమోదు చేసి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారికి రూ.8 లక్షల 50 వేలు అపరాధ రుసుం విధించినట్టు సీఐ కృష్ణ తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే 08922-234579కి సమాచారం అందించాలని తెలిపారు.

తాగునీటి పైపుల కోసం వినతి

శృంగవరపుకోట రూరల్: స్థానిక గొల్లపాకలు ప్రాంతంలో గతనెల 20న కొళాయి పైపులకు గోతులు తీసి గొట్టాలు వేసి వదిలేశారని... కొద్ది రోజుల క్రితం రెండో వైపు గోతులు తీసి వదిలేసి ఇంటింటి కొళాయిలు వేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సచివాలయ సిబ్బంది స్పందించాలని కోరుతూ వారంతా శనివారం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా న్యాయవాది రామకృష్ణ మాట్లాడుతూ దీనిపై కాంట్రాక్టర్‌లను సంప్రదించినా స్పందన లేదని.. దీంతో వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. తమ సమస్య పరిష్కరించపోతే న్యాయపరంగా ముందుకు వెళ్తామన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

శృంగవరపుకోట రూరల్: తహసీల్దార్‌గా ఎస్.కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాసరావు బదిలీపై గరివిడి వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్‌కు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

పల్స్‌పోలియోకు సిద్ధం

జామి: మండలంలో ఆదివారం జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సిద్ధమైనట్టు పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు చిన్నారులకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

కొత్తవలస: వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీల పరిధిలో గల 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆదివారం పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో 1,710 మంది పిల్లలకు, కొత్తవలస ఈహెచ్‌సీ పరిధిలో 4,388 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు వైద్యాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆదివారం చుక్కల మందు వేసుకోకుండా ఉండిపోయిన వారికి ఈ నెల 4, 5 తేదీల లో వేస్తామని వైద్యాధికారులు తెలిపారు.

నైతిక విలువలపై అవగాహన

రాజాం: పురపాక సంఘ పరిధిలోని పాఠశాలలో శనివారం రెడ్‌క్రాస్ ఛైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో మోటివేషన్ తరగతులు నిర్వహించినట్టు బూరాడ శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు నైతిక విలువలు, కమ్యూనికేషన్ స్కిల్స్ ఆవశ్యకతను తెలియజేశామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎమ్ విజయలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పురపాలక ఆశీలు పాట వాయిదా

రాజాం: పురపాలక సంఘం పరిదిలో రోజువారి ఆశీలు వసూలు చేయడానికి కమిషనర్ కార్యాలయంలో శనివారం ఆశీలు పాటు వేశారు. అయితే గుత్తేదారులు ఎవరూ పాల్గొనేందుకు హాజరు కాకపోవడంతో పాటను వాయిదా వేశారు. గత నెలలో మూడు సార్లు ఆశీలు పాటను ప్రకటించినప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో పాటను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. నాలుగో సారి వేలం పాటకు గుత్తేదారులు 10 మందికి ముగ్గురు మాత్రమే హాజరయ్యారు వారుకూడా పాటలో పాల్గొకుండా వెళ్లిపోవడంతో చివరకు వాయిదా పడింది. తదుపరి పాటను ఎప్పుడు వేసేది ప్రకటిస్తామని కమిషనర్ నారప్పలనాయుడు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

లక్కవరపుకోట: ఎల్.కోట ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వి.ప్రకాశరావు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని.. ఏప్రిల్ 21న రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. 5వ తరగతి పూర్తి చేసిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 ఫీజు చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాల సమయంలో సంప్రదించాలని సూచించారు.

రేపు జాబ్ మేళా

బొబ్బిలి: స్థానిక రాజా కళాశాలలో సోమవారం హెటిరో డ్రగ్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగ నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వీరేంద్ర కుమార్ తెలిపారు. 2020 నుంచి 2024 వరకు బీఎస్‌సి, ఎంఎస్‌సీ కెమిస్ట్రీ చేసిన పురుష అభ్యర్థులు బయోడేటాలతో సోమవారం హాజరు కావాలని ఆయన తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..


పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్


పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న బేబీనాయన, తెంటు

రాజాం: సీఎంగా కొనసాగేందుకు జగన్ మోహన్ రెడ్డికి అర్హత లేదని మాజీ మంత్రి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో వంగర మండలం అరసాడ గ్రామానికి చెందిన 35 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగు దేశం పార్టీలో చేరాయి. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి రైతులు, మహిళలు, యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీలు మైనార్టీలను దారుణంగా వంచించారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్షుభుక్త కృష్ణమూర్తి, మజ్జి వెంకటనాయుడు, పి.వెంకటరావు, కొరటాన గౌరినాయుడు, దొంతల దుర్గారావు, రాగోలు రమేష్, చిత్తిరి దాలిరాము, శెట్టి మురళి, తుమ్మి రాజా గోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు

గయ్యన్నవలస సర్పంచ్‌తో సహా..

మండలం గయ్యన్నవలస గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ సమతం లక్ష్మీ తో పాటు మరో 100 కుటుంబాలు శనివారం రాత్రి టీడీపీలో చేరాయి. కోండ్రు మురళీమోహన్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశత్వ వైఖరితో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సంక్షేమం నిర్వీర్యం అయ్యాయన్నారు. కార్యక్రమంలో గురవాన నారాయణరావు దుప్పపూడి శ్రీనివాసరావు. పొన్నాడ భీమేశ్వరరావు, రగమండల గణపతినాయుడు, చీడి కుమార్, చీడి జగన్నాథం తదితరులు ఉన్నారు. ● **తెర్లాం:** పూనువలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రెడ్డి ముకుందం మాష్టారు, శివాజీ మాష్టారు ఆధ్వర్యంలో సుమారు 40 కుటుంబాలు ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడుల ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరందరికీ పార్టీ కండువాలు వేసి బేబీనాయన, తెంటు లక్ష్మంనాయుడు ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సింగిరెడ్డి ఈశ్వరరావు, తోలాపు సత్యం, రెళ్ల రాము, రెళ్ల సూర్యనారాయణ, రెళ్ల పైడితల్లి, తోలాపు సింహచలం, పందిరి నాగరాజు, శనపతి లక్ష్మణరావు, తోలాపు బాగిరాజు, రెళ్ల మురళి, మామిడి ఆదినారాయణ, మామిడి రాజేష్, కల్లూరి విక్రమ్, పోలాకి యేసు, మామిడి సూర్యనారాయణలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెర్లాం మండల పార్టీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు, మాజీ జెడ్పీటీ సీ ప్రతినిధి నర్సుపల్లి వెంకటేష్, ముఖ్యనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివేకానంద హత్యకేసులో దోషి తేలాలి


మాట్లాడుతున్న కోళ్ల

లక్కవరపుకోట, మార్చి 2: ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బాబాయి వివేకానంద రెడ్డి హత్య కేసులో అసలు ముద్దాయి ఎవరనేది తేల్చాలని ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలిత కుమారి డిమాండ్ చేశారు. శనివారం ఎల్.కోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మట్లాడారు. ఢిల్లీ కేంద్రంగా వివేకా కుమార్తె సునీతారెడ్డి తన తండ్రి చావుకు ప్రధాన కారణం జగన్ కుటుంబమేనని మీడియా పూర్వకంగా చెప్పిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. జగన్, భారతి, అవినాస్‌లతో పాటు మరికొంతమందిపై సీబీఐ దర్యాప్తు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, లాలం అర్జునరావు, భూపాల్ నాయుడు, రత్నాజీ, శివాజీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సొంత చెల్లికే అన్యాయం చేసిన సీఎం

● టీడీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన

బాడంగి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి సొంత చెల్లెలికే న్యాయం చేయని వ్యక్తి అని... రాష్ట్రంలో ఉన్న మహిళలందరికీ న్యాయం చేస్తామనడం విడ్డూరంగా ఉందని టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన అన్నారు. శనివారం బాడంగిలో తెంటు నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ జగన్ బాబాయి వివేకానంద రెడ్డిని అప్పట్లో ప్రభుత్వమే హత్య చేసిందని చంద్రబాబుపై ఆరోపణలు చేస్తూ సీబీఐ దర్యాప్తునకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంలో సీబీఐ విచారణ జరిపించడం లేదు ఎందుకని ప్రశ్నించారు. చెల్లి షర్మిలకు, పినతండ్రి కుమార్తె సునీతకు అన్యా యం చేశారని అన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలసి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు తెంటు రవిబాబు, కార్యదర్శి లచ్చుపతుల సత్యం, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు


అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

బొబ్బిలి: కృష్ణాపురం వెళ్లే దారిలో గల చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నారు. ఈ గ్రావెల్‌ను సమీపంలో గల కాలనీలో రోడ్ల కోసం వినియోగిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆర్ఐ కళ్యాణ చక్రవర్తి శనివారం మధ్యాహ్నం వీఆర్‌ఓతో కలసి వెళ్లారు. ఆర్ఐ వస్తున్నారని తెలిసి అక్కడి నుంచి గ్రావెల్ తవ్వుతున్న వారు వెళ్లిపోయారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వుతున్న మాట వాస్తవమేనని... దీనిపై తహసీల్దారుకు నివేదించి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఇటీవల జరిగిన రీసర్వే ప్రకారం చెరువు హద్దుల ప్రాప్తికి ఆక్రమణలు తొలగించుకున్నామే తప్ప అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టలేదని జగన్నాథపురం సర్పంచ్ బొద్దల పద్మాసత్యనారాయణ తెలిపారు.

పారాదిలో న్యాయ అవగాహన సదస్సు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి వాసుదేవన్

బొబ్బిలి: పారాది గ్రామంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి టి.వాసుదేవన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సందర్భాల్లో న్యాయపరంగా అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. జాతీయ లోక్‌అదాలత్, గిరిజన చట్టాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల విద్యాహక్కు చట్టం, తదితర వాటి గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు, ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ, న్యాయవాది అల్లాడ నగేశ్ కుమార్, గొర్లె కృష్ణ, గ్రామ పెద్దలు, పంచాయితీ కార్యదర్శి, వీఆర్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదు

● టీడీపీ విజయనగరం అభ్యర్థి అదితి గజపతిరాజు


కొత్తపేట, సాకేటివీధిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అదితి

విజయనగరం రూరల్: రాష్ట్రంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు కావడం లేదని, రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగుతోందని టీడీపీ విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా నగరంలోని 20, 13 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హామీలను వివరించారు. సాకేటివీధిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడే వారిపై కక్ష పెట్టుకుని.... కేసులు పెడుతున్నారన్నారు. ఇదేనా ఈ ప్రభుత్వం రాజ్యాంగానికి ఇస్తున్న గౌరవమని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సమస్యలు అధికమయ్యాయి తప్ప.. పరిష్కారం కాలేదన్నారు. సాకేటివీధిలో ఉన్న చర్చికి వెళ్లి క్రైస్తవుల సమస్యలు తెలుసుకున్నారు. బంగారమ్మపేట కాలనీలో కాయగూరల వ్యాపారుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగ చంటి, సుంకరి శ్రీనుబాబు, కల్లూరి లక్ష్మణరావు, చందక స్వప్న యాదవ్, కొయ్యాన సంతోష్, జిగిలి జనార్దన్, చందక తాతయ్యలు, దువ్వ కృష్ణ, బంటుపల్లి సన్యాసిరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాజాం: పౌష్టిహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చౌదరి సన్యాసమ్మ అన్నారు. శనివారం మల్లికార్జున కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్‌లతో లాభదాయకం

శృంగవరపుకోట రూరల్: డ్రోన్‌ల సాయంతో పురుగు మందుల పిచికారీ చేయడం రైతులకు అన్నివిధాలా లాభదాయకమని మండల వ్యవసాయాధికారి రవీంద్ర అన్నారు. శనివారం సంతగౌరమ్మపేట, కాపుసోంపురం గ్రామాల్లో పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్‌లతో పురుగు మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణ, ఉదయ్, ధనుంజయ్, ఏసులు మాట్లాడుతూ కేవలం పది నిమిషాల్లో ఎకరా పొలానికి డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారీ చేయవచ్చని చెప్పారు. ఖర్చు తక్కువ అని వివరించారు. వీఏఏ రవి, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల హక్కు పత్రాల పంపిణీలో సీఎం భజన

బొబ్బిలి: జగనన్న ఇళ్ల స్థలాల హక్కు పత్రాల పంపిణీ సభలో సీఎం జగన్‌పై స్తోత్ర పాఠాలు చదివి తమ భక్తిని చాటుకున్నారు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం తహసీల్దారు త్రినాథరావు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగితో పాటు పలువురు నాయకులు పొగడ్తల పర్వాన్ని సాగించారు. మానవ జన్మ ఎత్తిన వారికి ఇలాంటి సీఎం దొరకడం అదృష్టమన్నారు. ఒక్క వ్యక్తి సమాజాన్ని ఎలా మార్చేస్తాడోనని అందరం అనుకున్నామని... కానీ చేతల్లో చేసి చూపించాడని అన్నారు.

పోలీసు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ


శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో త్వరలో జిల్లాకు రానున్న కేంద్ర బల గాలు బస చేసేందుకు కల్పించాల్సిన మౌలిక వసతులను పరిశీలించేందుకు శనివారం ఎస్పీ దీపిక సారిపల్లిలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి గదులు, మంచినీటి సౌకర్యం, వంట గదులు, భోజన శాలను పరిశీలించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ ఆష్మా పర హీన్, ట్రైనీ ఐపీఎస్ జావలి అల్వాన్స్, డీఎస్పీలు వీరకుమార్, గోవిందరావు, యూనివర్స్, సీఐలు నర్సింహమూర్తి, రామారావు తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాపాడుకుందాం


మాట్లాడుతున్న సోము రాంబాబు

దాసన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఆచరణలో కొనసాగకుండా తుంగలో తొక్కుతున్నాయని... దీన్ని కాపాడుకునేందుకు ప్రతి బహుజనుడూ ముందుకు రావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు పిలుపునిచ్చారు. శనివారం విజయనగరం అసెంబ్లీ నియోజవర్గ స్థాయి సమావేశం జమ్ము నారాయణపురం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సోము రాంబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు పైడిరాజు, బీఎస్పీ నాయకులు శివప్రసాద్, కేవీ రమణ, జగన్నాథం, అశోక్ అంబేడ్కర్, రాంబాబు, పి.శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ముహూర్తపు రాట


ముహూర్తపు రాట వేస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు

వంగర: సంగాంలోని సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం గంగమ్మతల్లి గుడి ముందు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతి ముహూర్తపు రాట వేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జాతరకు ఏర్పాట్లు మొదలు పెట్టారు.

తరలించారు.. పేరు మార్చడం మరిచారు

- ఇంకా పీఆర్ ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయంగా పేరు
- ఇదీ రేగిడిలోని ఉపాధి కార్యాలయం పరిస్థితి

రేగిడి: రేగిడిలోని జాతీయ ఉపాధిహామీ పథకం కార్యాలయం పేరు మార్చకపోవడంతో పనులపై వచ్చే వారంతా అవస్థలకు గురవుతున్నారు. రాజాం సబ్‌డివిజన్ పంచాయతీరాజ్ ఉప కార్యనిర్వాహక ఇంజినీరు కార్యాలయం గతంలో రేగిడిలో ఉండేది. ప్రస్తుతం ఆ కార్యాలయం రాజాం తరలించారు. ఆ కార్యాలయం ఇక్కడి నుంచి తరలించి దాదాపు ఎనిమిదేళ్లు కావస్తోంది. ఈ నేపథ్యంలో ఆ భవనంలో ప్రస్తుతం మండల ఉపాధిహామీ పథకం కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచే ఉపాధి పథకం వేతనదారులకు అన్నిరకాల సేవలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి వచ్చే వేతనదారులు, సిబ్బంది కార్యాలయం పేరు మార్చకపో వడంతో ఇబ్బందిపడుతున్నారు. తక్షణమే కార్యాలయం ఉన్న బోర్డు పేరును మార్చాలని పలువురు కోరుతున్నారు.



పేరుమార్చని ఉపాధి కార్యాలయం

నేటి నుంచి పల్స్ పోలియో



బొండపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

గజపతినగరం: మండలంలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న పల్స్‌పోలియోకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి కృష్ణ రెడ్డి తెలిపారు. శనివారం గజపతినగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 871 మంది ఐదేళ్లలోపు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. ఈ మేరకు 33 కేంద్రాలను ఏర్పాటుచేయడంతోపాటు ప్రత్యేక కేంద్రాలు రైల్వేస్టేషన్, ఆర్టీసీకాంప్లెక్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఐదు గంటలవరకు పల్స్‌పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. 21 మంది ఏఎన్ఎంలు, 50 మంది ఆశాకార్యకర్తలు లు, 61 మంది అంగన్‌వాడీ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీవోలు సేవలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకుపిల్లల తల్లిదండ్రులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **బొండపల్లి:** నిండు జీవితానికి రెండు చుక్కలతోనే చక్కని భవిష్యత్తు అని దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సత్యవతి అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 5 ఏళ్ల లోపు 2,118 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గొట్లాం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ గ్రేసీ, సచివాలయ హెల్త్ సెక్రటరీ బి.అంజలి తదితరులు పాల్గొన్నారు. **బొబ్బిలి:** బొబ్బిలి పీపీ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు సంతోషి కుమారి, రెడ్డి రవికుమార్ తెలిపారు. శనివారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు జేసీ రాజు, ఇతర ప్రతినిధులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రవికుమార్ ఆధ్వర్యంలో పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పక్కి, పిరిడి పీహెచ్‌సీల వైద్యులు రఘువంశీ, భరద్వాజ్ పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయడానికి కృషి

- తెలుగుదేశం పార్టీ నాయకుడు కేపి నాయుడు

గంట్యాడ: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిని చేయడం కోసం కృషి చేద్దామని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కేపి నాయుడు తెలిపారు. శనివారం గంట్యాడలో ఐదు మండలాలుకు చెందిన టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలోని టీడీపీ నాయకులు భాస్కర్ నాయుడు, అల్లు విజయకుమార్, గోపాలరాజు, బండారు బాలాజీ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు టార్పాలిన్ల పంపిణీ

నెల్లిమర్ల: మండలంలోని నారాయణపట్నంలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులు బాడితభాను రమేష్, పతివాడ సత్యం కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధకవనకచంలె వంట వండుకునే సామగ్రి, టార్పాలిన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు పి.దుర్గా ప్రసాద్, డి.గౌరీ, రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటర్, స్థానికులు రామకృష్ణ, ఎం.త్రినాథరావు, పూర్ణచంద్ర, గణేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి

- సర్వశిక్ష అభియాన్ ఎస్పీడీ శ్రీనివాసరావు

చీపురుపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్వశిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు కోరారు. ఇంటెల్ సంస్థ సౌజన్యంతో బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధ ప్రయోగశాలలను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీడీ మాట్లాడారు. కృత్రిమ మేధ ప్రయోగ శాలలను విద్యార్థులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. దానికి తగినట్టుగా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేసిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను కేవలం చదువు కోసమే వినియోగించాలని ఆయన హితవు పలికారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ బైజూస్ సంస్థ రూపొందించిన కంటెంట్‌ను పిల్లలకు బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా ప్రభుత్వ పరీక్షల బోర్డు కార్యదర్శి టి.సన్యాసిరాజు, ఇంటెల్ సంస్థ ప్రభుత్వ వ్యవహారాల ఆసియా పసిఫిక్, జపాన్ సీనియర్ డైరెక్టర్ శ్వేత ఖురానా, హెచ్ఎం చంద్రశేఖర కుమార్, మెట్టపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయ్ కుమార్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, ఎంఈఓ ఎం. బూసినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీడీ శ్రీనివాసరావు

కానిస్టేబుల్ నాయుడుకు స్వర్ణ పతకం

గుర్ల: అంతర్జాతీయ 28వ మాస్టర్స్ థాయిలాండ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పున్నపురెడ్డిపేట గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పున్నపురెడ్డి సన్యాసినాయుడు పోల్‌వాల్ట్‌లో స్వర్ణ పతకం సాధించాడు. థాయ్‌లాండ్‌లోని రాజభట్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో గత నెల 21 నుంచి 25 వరకు ఈ పోటీలు జరిగాయి. బంగారు పతకం సాధించిన సన్యాసి నాయుడును సహచర ఉద్యోగులు, గ్రామస్థులు అభినందించారు.



సన్యాసినాయుడు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

బొండపల్లి: చందకపేట గ్రామానికి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం వేకువజామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. రెండు లారీలు వెనుక, ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. విజయనగరం వైపు నుంచి సాలూరు వైపు వెళుతున్న లారీని రోడ్డుపై నిలిపి ఉంచారు. వెనుక నుంచి వేగంగా వచ్చిన ఇంకొక లారీ దీన్ని ఢీకొట్టింది. ప్రమాద సమయంలో రెండు లారీల్లో ఉన్న డ్రైవర్లతో పాటు క్లీనర్లకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

జనసేనలో 50 కుటుంబాలు చేరిక

భోగాపురం: మండలంలోని చినరావాడలో 50 కుటుంబాలు జనసేనలో శనివారం జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి లోకం నాగ మాధవి ఆధ్వర్యంలో చేరాయి. తమ గ్రామానికి కనీసం రోడ్డు లేదని రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామానికి రోడ్డు వేస్తామని మాధవి హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో ఓటు వేసి ఎమ్మెల్యేగా బడ్డుకొండను గెలిపించినా, ఆయన ఏమీ చేయలేదని వాపోయారు. తమ గ్రామానికి మంచి చేస్తారన్న నమ్మకంతో జనసేనలో చేరుతున్నట్లు గ్రామస్థులు వివరించారు.

నిధులు లేక.. నిర్వహణ భారం

- పంచాయతీలపై అధనపు భారం
- ఇదీ జిల్లాలో గ్రామ సచివాలయాల పరిస్థితి

గ్రామ సచివాలయాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆ భారం పంచాయతీలపై పడుతోంది. వాస్తవానికి చిన్న పంచాయతీలకు ఆర్థికసంఘం నిధులే ఆధారం. ఈ నిధులు సైతం ఇటీవల ప్రభుత్వం కరెంటు బిల్లుల చెల్లింపునకు వినియోగిస్తున్న విషయం విదితమే. జనరల్‌ఫండ్‌లో నిధులు బ్లీచింగ్, వీధి దీపాల నిర్వ హణకే సరిపోని పరిస్థితి నెలకొంది.
- నెల్లిమర్ల

నెల్లిమర్ల మండలంలో 26 పంచాయతీల పరిధిలో 17 సచివా లయాలను ఏర్పాటుచేశారు. వీటి నిర్వహణ బాధ్యత పంచాయ తీలకు అప్పగించారు. అయితే పెద్ద పంచాయతీల వరకూ పర్వాలేకున్నా ఎటువంటి ఆదాయం లేని చిన్న పంచాయతీలు మాత్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నిర్వహించలేమని అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఇదే పరిస్థితి జిల్లా వ్యాప్తంగా నెలకొంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 777 పంచాయతీలకుగాను 664 గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేశారు. మరో 114 వార్డు సచివాలయాలు ఉన్నాయి. కానీ ప్రభుత్వం సచివాలయాల నిర్వహణకు నిధులు సమకూర్చడంలేదు. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఇబ్బందులుతప్పడంలేదు. ఒక్కో సచివాలయంలో దాదాపు 11 శాఖల సిబ్బంది విధులు నిర్వ హిస్తున్నారు.

విద్యుత్ బిల్లులు తడిసి మోపెడు..

గ్రామపాలనలో కీలకపాత్ర పోషిస్తున్న సచివాలయాలకు ఆర్థిక సమస్యలు తప్పడంలేదు. కనీసం కంప్యూటర్లకు తెల్ల కాగితాలు, స్టాప్లర్, పిన్నులు, తదితర సామగ్రికి కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు. ప్రతినెలా ఒక్కో సచివాలయంలో ఇంటర్‌నెట్‌కు రూ.600 నుంచి రూ.900 వరకు బిల్లులు చెల్లించాల్సివస్తోంది. ప్రింటర్‌కు వాడే కేటరైజ్ నిమిత్తం దాదాపు రూ.1200 ఖర్చుచేస్తున్నారు. విద్యుత్ బిల్లులు, సిబ్బంది తాగే మినరల్ వాటర్, స్వీపర్ల జీతభత్యాలు తడిసిమోపడవుతున్నాయి.

ఇవీ సమస్యలు..

- ప్రస్తుతం సచివాలయాలు ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. కొత్త భవనాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. మారుమూల గ్రామాలకు సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో సచివాలయాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయ కపోవడం విమర్శలకు తావిస్తోంది.
- తరచూ ప్రింటర్లు,కంప్యూటర్లు, బయోమెట్రిక్ యంత్రాల మరమ్మతులకుపైసా నిధులు కూడా ప్రభుత్వం ఇవ్వడంలేదు. దీంతో తమకు ఇబ్బందులు తప్పడంలేదని కార్యదర్శులు లబోదిబోమంటున్నారు.
- మూడేళ్ల కిందట గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుచేశారు. తొలిగా వీటి నిర్వహణకు ఓ పర్యాయం రూ.1500, మరోసారి రూ.1000 ప్రభుత్వం కేటాయించిందని, అప్పటి నుంచి నేటి వరకు పైసా విడుదలచేయలేదని కార్యదర్శులు వాపోతున్నారు. ప్రజలు తీసుకునే వివిధ ధ్రువపత్రాలపై వసూలయ్యే నగదులో కొంతభాగం కేంద్రాల నిర్వహణకు ఇస్తామని మొదట్లో అధికారులు చెప్పినా నేటికీ ఆ ప్రక్రియ అమలుకాలేదని పేర్కొంటున్నారు.

ప్రచార బాధ్యతలు..

ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార బాధ్యతలను కూడా ప్రభుత్వం సచివాలయాలకే అప్పగించింది. వారంలో విధిగా ఒకరోజు ప్రచారం చేయాల్సిందేనని ఆదేశాలిచ్చింది. అటు ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబితాపత్రాలను ప్రింట్లు తీసి నోటీసు బోర్డుల్లో ప్రదర్శిస్తున్నారు. ప్రచార ఫ్లెక్సీల ఏర్పాటు, తదితర ఖర్చులను సచివాలయాలే భరించాల్సి ఉంది. సచివాలయ స్థాయిని బట్టి నెలకు రూ.5 వేల నుంచి రూ.15వేల వరకు అనేక పద్దుల కింద నిర్వహణ ఖర్చులు అవుతున్నాయి. సచివాలయాల్లో నిధులు లేకపోవడంతో ఆ భారం పంచాయతీలపై పడుతోంది. ఈ విషయంపై పలుచోట్ల గ్రామకార్యదర్శులు, సర్పంచ్‌లకు వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. గ్రామసచివాలయాలకు డీడీవోలుగా గ్రామ కార్యదర్శులే వ్యవహరిస్తున్నారు. సచివాలయాలకు పంచాయతీ నిధులు ఖర్చుచేసి రికార్డుల్లో కార్యదర్శులు నమోదు చేయగా.. ఆడిట్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ నిధులను ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నిస్తుండడంతో కార్యదర్శులు ఖంగుతింటున్నారు. తమబాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన చెందుతున్నారు.



నెల్లిమర్లలోని సచివాలయం

పంచాయతీలదే బాధ్యత..

సచివాలయాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోం దని ఈవోపీఆర్‌డీ కె.సింహాద్రి తెలిపారు. ఇప్పటికే ప్రభు త్వానికి ఇండెంట్ పెట్టామని చెప్పారు. ప్రింటింగ్, స్టేషనరీ, స్వీపర్ వంటి ఖర్చులకు నిధులు సర్దుబాటు చేసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని చెప్పారు. సచివా యాలను సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత పంచా యతీలదేనని తెలిపారు.

బిల్లులు కాక.. నాణ్యత లేక

- వేసిన కొద్దిరోజులకే ఊడిపోతున్న వైనం
- ఇదీ పాలకొండ-రాజాం మార్గంలో రోడ్డు దుస్థితి

రేగిడి: పాలకొండ-రాజాం మార్గంలో రాజాం, పాలకొండ సెక్షన్ల పరిధిలో రోడ్డు పనుల్లో నాణ్యత కొరవడింది. దీనికితోడు చేసిన పనులకు బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యత లోపం వల్ల వేసిన కొద్దిరోజులకే రోడ్లు ఊడిపోతున్నాయని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పాలకొండ నుంచి రాజాం మార్గంలో 21 కిలోమీటర్లకు గాను జిల్లాల పునర్విభజన నేపథ్యంలో పాలకొండ నుంచి మొదటి ఐదు కిలోమీటర్లు చిన్నయ్యపేట సెంటర్ వరకు మన్యం జిల్లా పరిధిలోగల పాలకొండ సెక్షన్ పరిధిలోకి చేర్చారు. రాజాం నుంచి చిన్నయ్యపేట సెంటర్ వరకు ఉన్న 16 కిలోమీటర్లు విజయనగరం జిల్లాలోని రాజాం అర్‌అండ్‌బీ సెక్షన్‌లో ఉంది. ఈ రోడ్డు రెండు వేర్వేరు సెక్షన్ల పరిధిలో ఉండడంతో మరమ్మతులు, ఇతర నిర్వహణ పనులు వేర్వేరుగా నిర్వహించాల్సి వస్తోంది. రెండేళ్లగా నిర్వహణలేక రోడ్డు అధ్వానంగా మా రింది. ఇది విశాఖ వెళ్లే ప్రధాన రహదారిమార్గం కావడం, ఈప్రాంతంలో చెక్కర పరిశ్రమ ఉండడంతో ప్రభుత్వం ఎట్టకేలకు ఈ రోడ్డు మరమ్మత్తులకు ముందుకొచ్చింది.పాలకొండ పరిధిలో ఉన్న ఐదు కిలోమీటర్లు రోడ్డుకు రూ.3.75 కోట్లు, రాజాం సెక్షన్ పరిధిలో ఉన్న రోడ్డుకు రూ.తొమ్మిది కోట్లు మంజూరయ్యాయి. మంజూరైన నిధులు పూర్తిస్థాయిలో చాలకపోవడం, కాంట్రాక్టర్‌కు బిల్లులు సరిగ్గా చెల్లించకపోవడం వెరసి పనులపై ప్రభావంపడింది. ఈ నేపథ్యంలో పాలకొండ-రాజాం ప్రధానరహదారి మార్గంలో రోడ్డు నిర్మాణం పూర్తిచేసిన చోట పనుల్లో నాణ్యత లోపించిందని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వేసిన మూణ్నాళ్లకే అక్కడక్కడ పాడవుతోంది. ఈ సెక్షన్‌లో పలుచోట్ల పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో చోదకులు అగచాట్లకు గురవుతున్నారు.



బోడిమెట్ట సమీపంలో బెర్మ్‌లు సరిగ్గా వేయకపోవడంతో రాళ్లు తేలిన దృశ్యం

నిధులు చాలక..పనులు కాక

పాలకొండ సెక్షన్ పరిధిలో మొత్తం ఐదు కిలోమీటర్లు పనులకు పూర్తిస్థాయి నిధులు సరిపోలేదు. దీంతో కొన్నిచోట్ల రోడ్డుబాగుందని విడిచిపెట్టగా, మరికొన్ని చోట్ల రోడ్డుపైనే రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. ఇలా వేసిన రోడ్డు సంకిలి, అన్నవరం దాటిన తర్వాత గోపాలపురం వద్ద ఊడిపోతోంది. ఈనేపథ్యంలో పాలకొండ- చిన్నయ్యపేట మొదటి ఐదు కిలోమీటర్ల రోడ్డు అరకొర నిధులతో పూర్తిచేయగా, రాజాం నుంచి చిన్నయ్యపేట వరకు ఉన్న 16 కిలోమీటర్లు రోడ్డు పనులు బిల్లులుకాక అర్థాంతరంగా నిలిచిపోయాయి. సంక్రాంతి తర్వాత మిగితా పనులు ముందుకుసాగడంలేదు. 70 శాతం పూర్తి కాగా, ఇంకా బెర్మ్‌లు, ఒకటి, రెండు చోట్ల సీసీరోడ్డు పూర్తిచేయాల్సి ఉంది.రోడ్డు ఇరువైపులా బెర్మ్‌లు సరిగ్గా రోలింగ్ చేయలేదు. దీంతో అక్కడక్కడా పెద్దరాళ్లు రహదారికి ఆనుకుని కనిపిస్తున్నాయి. కిందికు వాహనాలు దిగితే పడిపోతున్నామని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు.



సంకిలి వద్ద పెచ్చులూడుతున్న రోడ్డు

నిధుల సమస్యతో నిలిచిన మరమ్మతులు..

మొత్తం 21 కిలోమీటర్లలో మొదటి ఐదు కిలోమీటర్లు పాలకొండ సెక్షన్, మిగతా 16 కిలోమీటర్లు రాజాం సెక్షన్ పరిధిలో ఉన్నట్లు పాలకొండ, రాజాం సెక్షన్ల ఆర్‌అండ్‌బీ ఏఈలు జగన్మోహనరావు, నాగభూషణరావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. రాజాం సెక్షన్ మరమ్మతులు నిధుల సమస్యతో నిలిచిపోయినట్లు ఆ సెక్షన్ ఏఈ నాగభూషనరావు చెప్పారు. పాలకొండ సెక్షన్ పరిధిలో ఐదుకిలోమీటర్లు మరమ్మతులు పూర్తయినట్లు జగన్మోహనరావు తెలిపారు. ఈ పనుల్లో ఒకటి రెండు చోట్ల ప్యాచ్‌వర్కులు గుర్తించామని చెప్పారు. అప్పట్లో తగినంత నిధులు లేకపోవడంతో కొన్నిచోట్ల బాగున్నచోట్ల రోడ్డు వేయలేదని తెలిపారు. వేసినరోడ్డు పాడైతే కాంట్రాక్టర్‌తో మళ్లీ నిర్వహణ చర్యల్లో బాగుచేయిస్తామని చెప్పారు.

రహదారి బాగోలేక.. బస్సులు రాక

- ఆ పది గ్రామాలకు రవాణా కష్టాలు
- ఇదీ రేగిడి మండలంలో పరిస్థితి

రేగిడి: ఉంగరాడమెట్ట- ఖండ్యాం రహదారి అధ్వా నంగా మారడంతో ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి. మండలంలో అత్యంత కీలకమైన ఈ మార్గం రేగిడి, సంతకవిటి పలు గ్రామాలను కలుపుతుంది. నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలతో రద్దీగా ఉంటోంది. రహ దారి మార్గం సరిగ్గా లేక పోవడం,ఉన్న రహదారి కొన్ని గ్రామాల్లో ఆక్రమణలకు గురై ఇరుగ్గా మారడంతో ఆర్టీసీ బస్సులు తిప్పేందుకు సంస్థ అధికారులు ముందుకు రా వడంలేదు. ఇటీవల ఈ రూట్లో బస్సు సౌకర్యం లేకపోవ డంపై ఖండ్యాం తదితర గ్రామాల ప్రజలు స్పందనలో ఫిర్యాదుచేసిన విషయం విదితమే. దీంతో కలెక్టర్‌కు ఆర్టీసీ అధికారుల వివరణ కోరారు. వండానిపేట వద్ద బస్సు తిరగడానికి స్థలం సమస్య వేధిస్తోందని, పైగా ఈ రూట్ ఎంత మాత్రం బాగోలేదని చెప్పి తప్పించుకున్నట్లు సమాచారం. ఆయా గ్రామాల్లో రోడ్ల పరిస్థి తులపై సర్వేచేసి కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు.



గోతులమయమైన ఉంగరాడ- ఖండ్యాం రోడ్డు

విద్యార్థులకు తప్పని అవస్థలు..

ఉంగరాడమెట్ట సెంటర్ నుంచి తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఖండ్యాం వరకూ ఈ రూట్లో 10 గ్రామాలకు రవాణా కష్టాలు తప్పడం లేదు. ఇదే మార్గం గుండా సంతకవిటి నిత్యం వందలాది మంది రాకపో కలు సాగిస్తున్నారు. ఈ రూట్‌లో రోడ్డు బాగోలేక ఆర్టీసీ బస్సులు తిరగ కపోవడంతో ప్రైవేటు ఆపరేటర్లు సొమ్ము చేసుకుంటున్నారు. కళాశాలలు, పాఠశాలలు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలుపడుతున్నారు. స్థానికంగా కూరగాయలు సాగుచేసే రైతులకు మార్కెట్‌కు తరలింపునకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించాల్సివస్తోందని వారు వాపోతున్నారు. ఈ రహదారి అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు శీతకన్ను వేశారని పది గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రతిపాదించినా కేటాయింపులు లేవు

ఉంగరాడమెట్ట నుంచి వన్నలి మీదుగా ఖండ్యాం రహదారి దాదాపు తొమ్మిది కిలో మీటర్లకు గాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డు పనులు జరిగినట్లు అర్‌అండ్‌బీ ఏఈ నాగ భూషణం తెలిపారు. అప్పటి నుంచి ఈరోడ్డుకు నిధులు ప్రతిపాదించినా కేటాయింపులు లేవని చెప్పారు. ఉంగరాడమెట్ట నుంచి వన్నలిమీదుగా ఖండ్యాం, సంతకవిటి వరకు రోడ్డు మరమ్మతులు అవసరమని తెలిపారు.





ఎంవీజీఆర్‌లో వార్షికోత్సవం

విజయనగరం: డాక్టర్ పీవీజీ రాజు శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎంవీజీఆర్ కళాశాలలో 26వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పయనీర్ అల్యూమినియం కంపెనీ డైరెక్టర్ ఎల్ఎస్ రావు హాజరయ్యారు. వీరికి ఎన్‌సీసీ విద్యార్థులు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను, వివిధ ఆవిష్కరణలను, పరిశోధనా నమూనాలను పరిశీలించారు. విద్యార్థుల ఆవిష్కరణల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మారుతున్న విద్యా విధానానికి, ఉపాధి మార్గాలను పొందేందుకు వీలుగా మార్పు చేస్తూ వస్తున్నామన్నారు. ఎంవీజీఆర్ సుదీర్ఘ 26ఏళ్ల ప్రయాణంలో విద్యా బోధనలో ఎన్నో మార్పులు తీసుకు వచ్చామన్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ సీతారామరాజు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లిన ఘనత ఎంవీజీఆర్‌కు ఉందన్నారు. ఎల్ఎస్ రావు మాట్లాడుతూ తన అనుభవాలను వివరించారు. స్టార్టప్‌లు, ఐటీ రంగంలో భారత్ వేగంగా పుంజుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో శివశంకర రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



ఎంవీజీఆర్ కళాశాల వేదికపై ప్రముఖులు



